క్లుప్తంగా

స్వామివారి గుడి చుట్టూ సిమెంట్ రోడ్డు



దేవరపల్లిలో సిమెంట్ రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీపీ దుర్గారావు తదితరులు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయం చుట్టూ మండల పరిషత్ నిధులు రూ.19 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డును బుధవారం ఎంపీపీ కేవీకే దుర్గారావు పరిశీలించారు. భక్తుల ఆలయ ప్రదక్షణకు, శ్రీవారి సేవలకు ఈ రోడ్డు ఉపయోగపడుతుంది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దుగ్గిన గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కడిమి రాజు, పార్టీ మండల ఉపాధ్యక్షులు కామిశెట్టి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గోగులమ్మ జాతర

నిడదవోలు రూరల్: మండలంలోని కలవచర్ల గ్రామదేవత గోగులమ్మ వారి జాతర మహోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. గ్రామ శివార్లలో కొలువైన గోగులమ్మను భక్తులంతా దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు పెట్టారు. జాతరకు వచ్చిన ఆడపడుచులు, బంధువులతో గ్రామమంతా కళకళ లాడింది. సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కొవ్వూరమ్మ గుడి వద్ద అన్నసమారాధన

గోపాలపురం: మండలంలోని చెరుకుమిల్లి కొవ్వూరమ్మ గుడి వద్ద బుధవారం భారీఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. 12 సంవత్సరాల క్రితం కొవ్వూరమ్మ గుడిని ఏర్పాటు చేసి అప్పటి నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గూడూరి కోదండరాముడు తెలిపారు. ఈ ఏడాది కొవ్వూరమ్మ గుడి వద్ద సల్లాలమ్మ ఆలయం నిర్మించినట్లు రాముడు తెలిపారు.

చిన్నారులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



చాగల్లులో చిన్నారులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎంఈవో ఖాదర్‌బాబు

చాగల్లు: చాగల్లు భవిత కేంద్రంలోని చిన్నారులకు బుధవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేసినట్టు ఉపాధ్యాయుడు బి. రామచంద్రరావు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో వి.ఖాదర్‌బాబు విచ్చేశారు.భవితా కేంద్రంలో విద్యార్థులను దాతలు ప్రోత్సహించడం అభినందనీయమని ఖాదర్‌బాబు అన్నారు.చాగల్లుకు చెందిన కవిలి సత్యనారాయణ, కడలి సూర్యకాంతం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం కూడా చేశారని తెలిపారు.


లారీ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి



ఘటనా స్థలంలో ఢీకొన్న రెండు వాహనాలు

గోపాలపురం: స్థానిక వై.జంక్షన్ వద్ద బుధవారం లారీ ఢీకొన్న దుర్ఘటనలో కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చిన్నం శ్రీను (35) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం చిన్నం శ్రీను దేవరపల్లి ఆటో కిరాయికి వెళ్లాడు. అతడు తిరిగి దిప్పకాయలపాడు ఆటో నడుపుకుంటూ వెళుతుండగా గోపాలపురం వై.జంక్షన్ వద్దకు వచ్చేసరికి హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళుతున్న లారీ ఢీట్టింది. ఈ ప్రమాదంలో చిన్నం శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి మృతదేహం లారీ ముందుభాగంలోకి చొచ్చుకుపోయి నుజ్జునుజ్జయ్యింది. దాంతో బయటకు తీయడానికి పోలీసులు సుమారు గంట సేపు ఇబ్బంది పడ్డారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గోపాలపురం ఎస్ఐ కె.రామకృష్ణ చెప్పారు.

కాళీకృష్ణకు ఎన్‌టీఆర్ కీర్తి పురస్కార్



హైదరాబాద్‌లో ఎన్‌టీఆర్ కీర్తి పురస్కార్ అందుకుంటున్న కాళీకృష్ణ

దేవరపల్లి: దేవరపల్లికి చెందిన శ్రీకాకుళపు కాళీకృష్ణకు ఎన్‌టీఆర్ కీర్తి పురస్కార్ లభించింది. హైదరాబాద్‌లో బుధవారం తాను ఈ అవార్డు అందుకున్నట్టు ఆయన తెలిపారు. శిఖరం ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో విద్య, వైద్య, రాజకీయ, సామాజిక, సినీ రంగాల్లో ప్రతిభావంతులకు ఎన్‌టీఆర్ కీర్తి పురస్కారాలు అందజేసినట్టు ఆయన వివరించారు. తనను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వాసవీ సేవాదళ్ చైర్మన్, సామాజికవేత్త, పారిశ్రామిక వేత్తగా గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేసినట్టు కాళీకృష్ణ చెప్పారు.



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న పారిశ్రామికవేత్త కోడూరి మెహర్ శ్రీనివాస్



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకుడు రాజీవ్‌కృష్ణ



స్వాగతం పలుకుతున్న గోపాలపురం నియోజకవర్గ పరిశీలకుడు వెంకటేశ్వరరావు, ఆయన తండ్రి జనార్దనరావు



సీఎం జగన్‌తో కరచాలనం చేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



సీఎం బహిరంగ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

అడిగింది కాదనకుండా..

- కొవ్వూరు నియోజకవర్గానికి సీఎం జగన్ వరాల జల్లు
- వివిధ పనులకు రూ.50 కోట్ల కేటాయింపుపై హర్షాతిరేకాలు
- ముఖ్యమంత్రికి అడుగడుగునా ఘన స్వాగతం
- రోడ్ షో పొడవునా పూలవర్షం



కొవ్వూరులో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత



కొవ్వూరు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రోడ్ షో లో బస్సుపై పూలవర్షం కురిపిస్తున్న జనం

కొవ్వూరు: పట్టణ పర్యటనకు బుధవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొవ్వూరు నియోజకవర్గంపై వరాల జల్లు కురిపించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు పనులకు ఆయన పచ్చజెండా ఊపారు. స్థానిక ఎమ్మెల్యే, హోం మంత్రి తానేటి వనిత అడిగిందే తడవుగా, వాటన్నింటికీ నిధులు కేటాయిస్తున్నట్టు సభా ముఖంగా సీఎం జగన్ ప్రకటించడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో సొమ్ము జమ చేసే కార్యక్రమాన్ని బుధవారం ఆయన కొవ్వూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగాదీర్ఘకాలంగా సాకారం కాని కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్టు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. అలాగే కుమారదేవం, పైడిమెట్ట, బ్రాహ్మణగూడెం, చాగల్లు ఎత్తిపోతల పథకాలకు నూతన పంపుల ఏర్పాటుకు సీఎం నిధులు మంజూరు చేయడంతో ఆయకట్టుదారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. కొవ్వూరులో ఎస్సీ కమ్యూనిటీ హాలు, ముస్లింలకు షాదీఖానా నిర్మాణం, కాపు కల్యాణ మండపానికి నిధులను కేటాయించడంపై ఆయా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో అంబేడ్కర్ భవనాల నిర్మాణానికి రూ.6 కోట్లు ఖర్చయ్యే ప్రతిపాదనలకు సీఎం ఓకే చెప్పడంతో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. కొవ్వాడ కాలువ వరద సమస్య నుంచి తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట రైతులను గట్టెక్కించే కల్వర్టు నిర్మాణానికి నిధులు కేటాయించడంపై అన్నదాతల్లో ఆనందం వెల్లివిరిసింది. సుమారు రూ.50 కోట్ల విలు వైన పనులకు నిధుల మంజూరుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో హోం మంత్రి తానేటి వనిత ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొవ్వూరు జన ప్రభంజనం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాకతో కొవ్వూరు పట్టణం బుధవారం జన ప్రభంజనమైంది. హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి మంత్రులు, ఎమ్మెల్యేలు, వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుంచి సభా స్థలి వరకూ 2.1 కిలోమీటర్ల పొడవునా సీఎం రోడ్‌షో సాగింది. దారి పొడవునా మహిళలు, జనం ఆయనపై పూలవర్షం కురిపించారు. అడుగడుగునా జనాలు జగన్‌కు నీరాజనాలు పట్టారు. బహిరంగ సభా ప్రాంగణం జనంతో కిక్కిరిసింది. పరిసర భవనాలు, అపార్ట్‌మెంట్లపైకి జనం చేరుకుని ముఖ్యమంత్రి రాకను ఆసక్తిగా తిలకించారు. సభాస్థలికి వెళ్లే మార్గంలో సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతూ హోం మంత్రి తానేటి వనిత ఆకాశంలోకి ఎగురవేసిన భారీ బెలూన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొవ్వూరు పట్టణంలోని ఏ వీధి చూసినా సభకు వచ్చిన జనంతో కళకళలాడింది. జిల్లా నలుమూలల నుంచే గాకు ండా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు నాయకులు, అభిమానులతో పట్టణం కిక్కిరిసింది. పట్టణంలో ఎటు చూసినా సీఎం సభకు తరలి వచ్చిన వారి వాహనాలే దర్శనమిచ్చాయి. మధ్యాహ్నం 12.20 గంటలకే సీఎం బహిరంగ సభ ముగిసింది. అయితే మూడు గంటల వరకూ పట్టణంలో ట్రాఫిక్ రద్దీ కొనసాగింది. సీఎం పర్యటన సందర్భంగా బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చిన్నారుల కూచిపూడి, భరత నృత్యాలు అలరించాయి.

పార్టీ శ్రేణుల్లో జోష్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఊహించిన దానికంటే విజయవంతం కావడంపై వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. వివిధ కారణాలతో సీఎం పర్యటన రెండుసార్లు వాయిదా పడినప్పటికీ మూడోసారి బహిరంగ సభకు రెట్టించిన ఉత్సాహంతో పార్టీ శ్రేణులు తరలి రావడం పార్టీలో జోష్ నింపింది. హోం మంత్రి తానేటి వనిత నాయకులు అందరినీ సమన్వయ పరుచుకుంటూ ఏర్పాట్లలన్నీ స్వయంగా దగ్గరుండి చూసుకున్నారు. పైగా నియోజకవర్గ దీర్ఘకాలిక సమస్యలకు నిధులు రాబట్టడంతో వనిత సఫలీకృతం కావడం పార్టీకి మేలు చేకూరుస్తుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కొవ్వూరు పట్టణ సమస్యలపై..

కొవ్వూరు మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి పట్టణంలో రూ.40.68 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.అవుట్‌ఫాల్ డ్రెయిన్లు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, గోదావరి మాత విగ్రహం వద్ద నుంచి క్రిస్టియన్ పేట వైపు ఏటిగట్టుకు రిటైనింగ్ వాల్, ఎస్సీ కమ్యూనిటీ హాలు, ముస్లిం కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు నిధులివ్వాలని కోరారు. అలాగే కౌన్సిలర్ల గౌరవ వేతనం పెంచాలని కోరుతూ సీఎం జగన్‌కు చైర్‌పర్సన్ వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి పర్యటనలో హోం మంత్రి తానేటి వనిత, నిడదవోలు, గోపాలపురం ఎమ్మెల్యేలు జి.శ్రీనివాస్‌నాయుడు, తలారి వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, ప్రముఖ వ్యాపార వేత్త కోడూరి మెహర్ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు ఎస్.రాజీవ్‌కృష్ణ, గన్నమని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో దిగ్విజయం

జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజభరత్‌లతో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన అధికారులందరూ సమన్వయంతో పనిచేశారు. దీంతో ముఖ్యమంత్రి బహిరంగ సభ దిగ్విజయం అయ్యింది. వారం,పది రోజులుగా కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ సభా ప్రాంగణం వద్ద, రోడ్ షో మార్గంలోనూ ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, ఆయన సిబ్బంది ప్రణాళికా బద్ధంగా బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపు విధులు నిర్వహించడంతో సీఎం పర్యటన దిగ్విజయమైంది. విద్యుత్తు శాఖ అధికారులు రోడ్ షో మార్గంలో తీసుకున్న ముందస్తు చర్యలు సత్ఫలితాలు ఇచ్చింది.



కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు



సీఎం జగన్ రాక కోసం రోడ్ షో మార్గంలో ఎదురు చూస్తున్న మహిళలు

పోషకాహారంతో రక్తహీనతకు పరిష్కారం

- కుష్టు, ఎయిడ్స్, క్షయ నివారణ జిల్లా అధికారి డాక్టర్ వసుంధర



వైద్యులతో సమీక్ష జరుపుతున్న కుష్టు, ఎయిడ్స్, క్షయ నివారణ జిల్లా అధికారి డాక్టర్ వసుంధర

నల్లజర్ల: పోషకాహారం తీసుకోవడం ద్వారా మహిళలు, బాలికల్లోని రక్తహీనత సమస్యను అధిగమించవచ్చని కుష్టు, ఎయిడ్స్, క్షయ నివారణ జిల్లా అధికారి డాక్టర్ ఎస్. వసుంధర సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించేందుకు జిల్లా వైద్య అధికారుల బృందం బుధవారం నల్లజర్ల పీహెచ్‌సీని సందర్శించి, వివిధ అంశాలపై సమీక్షించింది. అనీమియా ముక్త భారత్‌లో భాగంగా గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను గుర్తించి, ఎలాంటి నివారణ చర్యలు చేపడుతున్నదీ పీహెచ్‌సీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అసంక్రమణ వ్యాధుల నివారణలో భాగంగా టీబీ, షుగర్ వంటి వ్యాధిగ్రస్తులను గుర్తించడం, వారికి అందిస్తున్న చికిత్స, పరీక్షల గురించి ఈ బృందం ఆరా తీసింది. టీబీ వ్యాధిగ్రస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోజూ ఉండే ఓపీ, అందిస్తున్న సేవలను పరిశీలించారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు పోషకాహారం అందించేందుకు నిక్షయ మిత్రలను ఎంపిక చేయాలన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుడ్ని చూసి..

ఈ వైద్య బృందం ఆసుపత్రిలో ఉండగానే దీర్ఘకాలిక కుష్టురోగి పుల్లారావు చికిత్స కోసం అక్కడకు వచ్చాడు. అతడి వ్యాధి పరిస్థితిని చూసి చలించిపోయిన డాక్టరు వసుంధర వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో అతడికి నవశకం పెన్షన్‌కు సిఫార్సు చేశారు. ఈ బృందంలో జిల్లా న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టరు పి.లక్ష్మీదేవి, శివకుమార్, శ్యామ్‌సుందర్, టీబీ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ వి.ఆశాజ్యోతి, నల్లజర్ల వైద్యాధికారులు డాక్టర్ తెల్లం గంగాధరరావు, డాక్టరు మహమ్మద్ సిరాజుద్దీన్, సీహెచ్‌వో చంద్రశేఖరరాజు, వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కుమారుడి జన్మదిన వేడుకలు



సీఎం జగన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, ఆయన కుమారుడు వరుణ్ సాయి

నిడదవోలు: ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడి కుమారుడు వరుణ్ సాయి జన్మదిన వేడుకలను బుధవారం పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతులు వైఎస్సార్ సీపీ ఆకారంతో తయారు చేసిన కేక్‌ను కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. నియోజకవర్గం నుంచి వివిధ గ్రామాల నుంచి భారీగా తరలి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు వరుణ్‌సాయికి పుష్పగుచ్చాలు అందించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, పార్టీ నిడదవోలు, పెరవలి మండలాల అధ్యక్షులు అయినీడి పల్లారావు, వీరమళ్ళ సత్యనారాయణ, ఎస్‌కే వజీరుద్దీన్, గోపిరెడ్డి శ్రీనివాస్, కారింకి అన్నవరం, వెలగన నరేష్, ఆలమూరి రాజా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, ఆయన కుమారుడు వరుణ్ సాయి కొవ్వూరు వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌కు కలిశారు.

సీనియర్ సిటిజన్స్ సంఘ మండల కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ మండల నూతన కార్యవర్గం

ద్వారకాతిరుమల: వృద్ధుల సంక్షేమానికి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కృషి చేస్తోందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి అన్నారు. స్థానిక బ్రాహ్మణ నిత్యాన్నదాన సదనంలో మండల సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక, ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఏలూరు జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సాగిరాజు జానకి రామరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముందుగా మండల గౌరవాధ్యక్షుడిగా మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, అధ్యక్షుడిగా బలుసు చినవీరభద్రరావు, సహాధ్యక్షుడిగా గంజి కాశీవిశ్వనాథం, ఉపాధ్యక్షుడిగా యిమ్మడి రామ్మోహన్‌రావు, కార్యదర్శిగా నాదెళ్ల బుల్లి వెంకటరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పావులూరి మధుసూధనరావు, జాయింట్ కార్యదర్శిగా బలుసు పెద్దవీరభద్రరావు, కోశాధికారిగా బొప్పన వెంకటేశ్వరరావు, అలాగే కార్యవర్గ సభ్యులుగా దేవరపల్లి రాయుడుబాబు చౌదరి, తూంపాటి సత్యనారాయణ, గారపాటి మల్లేశ్వరరావు, పోలిన లక్ష్మీనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుక్కున్నూరి రామచంద్రరావు మాట్లాడుతూ సమాజంలో వృద్ధులకు జరుగుతున్న అన్యాయాలను, ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ సంఘాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నిడదవోలు: పట్టణంలోని రైల్వేస్టేషన్ సెంటర్లోని ఆటో ఓనర్స్, వర్కర్స్ సమావేశాన్ని బుధవారం ఎల్లే కృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గోదావరి ఆటో వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)అధ్యక్షుడిగా పీవీ ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా జువ్వల రాంబాబు, ఉపాధ్యక్షుడిగా ఎం.విష్ణువర్ధనరావు, కార్యదర్శిగా టి.రవి, కోశాధికారిగా పాలా శ్రీనివాస్, సహాయ కోశాధికారిగా జి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా ఎం. సూరిబాబు, ఎ.వెంకటరాజు, ఎ.శ్రీను, ఎండీ నౌషద్, ఏడుకొండలు, హోసన్న, ఉస్‌కే బాషా, దేవిలు ఎంపికయ్యారు.

ఆలోచనా శక్తికి ప్రాజెక్టులు అవసరం

గోపాలపురం: విద్యార్థులు తమ ఆలోచనా శక్తిని పెంపొందించు కోవడానికి ప్రాజెక్టులు ఎంతగానో దోహద పడతాయని తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ అన్నారు. గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెం గ్రామానికి చెందిన కోయ మాధురి అనే విద్యార్థిని తయారు చేసిన తాగునీటి ఆదా, రోడ్లు, భవనాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నమూనా ప్రాజెక్టులను బుధవారం ఆయన పరిశీలించారు. విద్యార్థిని మాధురిని తహసీల్దార్ రవీంద్రనాథ్, ఎస్ఐ కె.రామకృష్ణ తదితరులు అభినందించారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం

నల్లజర్ల: విద్యార్థులకు నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. గణితాన్ని సులభంగా ఎలా నేర్చుకోవచ్చో అనే అంశాన్ని ఎస్కే మస్తాన్ అనే ఉపాధ్యాయుడు బుధవారం విద్యార్థులకు సోదాహరణంగా వివరించారు. అనంతరం ఆటలు,పాటలతో విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. గ్రంథపాలకురాలు ఏవీ రమణ విద్యార్థులకు అల్పాహారం అందించారు.

ముగిసిన ఎండు మిరపకాయల సీజన్

- రైతులకు ఊహించని లాభాలు
- ఎకరాకు రూ.2.50 లక్షల వరకూ ఆదాయం



పల్లంట్లలో ఆరబెట్టిన ఎండు మిరపకాయలు

దేవరపల్లి: ఈ ఏడాది ఎండు మిర్చి సీజన్ ముగిసింది. ఫిబ్రవరిలో ప్రారంభమైన ఎండు మిర్చి విక్రయాలు మే నెల వరకూ జరిగాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో అమ్మకాలు జోరుగా సాగాయి. మిర్చి సాగు చేసిన రైతులకు ఊహించని లాభాలొచ్చాయి. కిలో రూ.600 నుంచి 400 వరకూ ధర పలికింది. ముదరకాయలు కిలో రూ.600 ధర పలకగా, లేత కాయలు రూ. 350 నుంచి 400 ధర పలికాయి. దిగుబడులు, రేటు ఆశాజనకంగా ఉండి లాభాలు రావడంతో రైతులకు సంతోషంగా ఉన్నారు. ఎకరాకు సుమారు 400 కిలోల దిగుబడి వచ్చినట్టు రైతులు తెలిపారు. ముందర కాపుల కంటే లేత కాపుల దిగుబడి ఆశాజనకంగా ఉండడం వల్ల మంచి ఆదాయం వచ్చినట్టు తెలిపారు. ఎకరాకు సుమారు రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చినట్టు పలువురు రైతులు తెలిపారు. 2023–24 ఏడాదికి కారం, పచ్చళ్ల సీజన్ దాదాపు ముగియడంతో మిరపకాయల అమ్మకాలు ముగిశాయన్నారు. మండలంలోని పల్లంట్ల, కురుకూరు, లక్ష్మీపురం, దేవరపల్లి గ్రామాల్లో ఎండు మిర్చి సాగు చేశారు. పల్లంట్ల, కురుకూరు ఎండుమిర్చికి మార్కెట్లో డిమాండ్ ఎక్కువ. దేశవాళీ రకం మిర్చి రెండు గ్రామాల్లో ఎక్కువగా సాగు చేయడం వల్ల పచ్చళ్లు, కారం ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంటుందని వినియోగదారుల నమ్మకం. ఈ ఏడాది సీజన్ లాభాలతో ముగియడంతో రైతులు ఖుషిఖుషీగా ఉన్నారు. దేవరపల్లి మండలంలో 180 ఎకరాల్లో ఎండు మిర్చి సాగు చేశారు. ఎండుమిర్చి సాగు లాభసాటిగా ఉండడంతో వచ్చే ఏడాది సాగు విస్తీర్ణం పెరుగుతుందని ఉద్యానశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

హృదయాలయ భవన నిర్మాణానికి విరాళం

నిడదవోలు: పట్టణంలోని మానసిక విద్యాంగుల ప్రత్యేక పాఠశాల (హృదయాలయం)లో ఆశ్రయం పొందుతున్న అభాగ్యుల కోసం శాశ్వత భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సత్కార్యానికి తుమ్మలపల్లి లక్ష్మణరావు, కుమారి దంపతులు బుధవారం రూ. 15 వేల ఆర్థిక సాయాన్ని హృదయాలయం నిర్వాహకులు దండే గణేష్, విశాలక్షిలకు అందజేశారు. మానసిక దివ్యాంగులకు ఆశ్రయం కల్పిస్తున్న హృదయాలయం శాశ్వత భవన నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలని నిర్వాహకులు కోరారు.

బాలికల కళాశాల్లో విద్యార్థినులను చేర్పించండి



విద్యార్థినులను కళాశాల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్న ఉండ్రాజవరం హైస్కూల్ హెచ్‌ఎం విశ్వప్రసాద్

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కళాశాలలో టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థినులను చేర్పించాలని వారి తల్లిదండ్రులను ఆ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వి. విశ్వప్రసాద్ కోరారు. టెన్త్ పాసైన విద్యార్థినులను తమ కళాశాల్లో చేర్పించాలని కోరుతూ బుధవారం ఆయన మండలంలోని తాడిపర్రు తదితర గ్రామాలో తల్లిదండ్రులను కలుస్తూ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఈసీ రెండు గ్రూపులతో పాటు పూర్తిస్థాయిలో అధ్యాపకులు, తరగతి గదులు, అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో చివటం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసు, టీచర్లు బి.సుబ్బారావు, కె.రాంప్రసాద్, అహూజా తదితరులు పాల్గొన్నారు.